

శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్        ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంథ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు



| సంపుటి : 09 | **నేపథ్యం:** | చైత్ర పౌర్ణమి |
|---|---|---|
| సంచిక : 09 | **నిష్ఠ - సబూరి** | ఏప్రిల్ 1, 2026 |




| పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | **సంఘ సేవ ఎలా చేయాలి? ఎందుకు చేయాలి?**<br><br>ఈ ప్రవచనంలో సుబ్బరామయ్య సార్ సంఘసేవ ఎలా, ఎందుకు చేయాలో, 3 దోషాలు ఎలా పోగొట్టుకోవాలో చెపుతున్నారు. |
|---|---|


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

## చిన్మయ వ్యాపితం సర్వం త్రైలోక్యం సచరాచరం|
## అసిత్వం దర్శితంయేన తస్మై శ్రీ గురవే నమః ||

### విషయ సూచిక


| | |
|---|---|
| శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధ | 4 |
| భక్తుల అనుభవాలు | 10 |
| శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు | 13 |
| సార్ సత్సంగం | 21 |
| మహాత్ముల వాక్యాలు | 28 |
| ఈ చూడబడేదంతా కలసి నేను | 28 |

శ్రీ షిర్డీ సాయిబాబా | శ్రీ భరద్వాజ మాస్టర్ | శ్రీ సుబ్బరామయ్య గారు | శ్రీ వెంకయ్యస్వామి | శ్రీ దర్గాస్వామి





సద్గురు శ్రీ  సుబ్బరామయ్య మహారాజ్



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

## సంపాదకీయం

ఓం సాయిరాం

# శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధ

శ్రీ పెసల సుబ్బరామయ్య సార్ (1939-2017) జీవనం భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి మరియు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారి బోధలకు ఒక సజీవ సాక్ష్యం. **"పరోపకారార్థ మిదం శరీరం"** (ఈ శరీరం పరోపకారం కోసమే) అనే సూత్రాన్ని శ్రీ సార్ తన ప్రతి చర్య ద్వారా ఆచరించి "అన్ని జీవుల్లో వెంకయ్య ఉన్నాడని గుర్తించుకోయ్యా" అన్న స్వామి మాటకు ఆచరణాత్మక దర్పణంగా నిలిచారు. శ్రీ సార్ జీవితం, బోధలు మరియు భక్తుల అనుభవాల సారాంశం మన అవగాహన, ఆచరణకు మార్గ ప్రదీపికలుగా నిలుస్తాయి.

క్రిందటి సంచికలలో దైవీసంపదతో కూడిన శ్రీ సార్ జీవన విధానం, శ్రీ భరద్వాజ మాష్టారి సాంగత్యం - శ్రీ వెంకయ్య స్వామి వారి సన్నిధితో తనను తాను మలచుకొన్న రీతిని, "ఒంటి దూలపు ఇల్లులా సద్గురువే ఆధారంగా" సంపూర్ణ శరణాగతితో వ్యక్తమైన దివ్యస్థితిని స్మరించుకున్నాము. ఈ సంచికలో శ్రీ మాష్టారు - స్వామిల సన్నిధిలో సద్గురుసేవలో శ్రీ సుబ్బరామయ్య వహించిన నిష్ఠను గూర్చి స్మరించుకుందాము.

**శ్రీ సార్ గురు సేవలో వహించిన నిష్ఠ - సబూరి :**

"నిష్ఠ, సబూరి అక్క చెల్లెల్ల వంటివి; అవి సమర్పించకుంటే గురు సేవలో స్థిరత్వం లభించదు" అనే శ్రీ భరద్వాజ మాస్టర్ గారి వాక్కును శ్రీ సార్ సాధనా జీవితం ప్రతిబింబిస్తుంది.

**నిష్ఠ అంటే సద్గురువును సర్వ సమర్థుడు, సర్వవ్యాపి అన్న ఎరుకతో సద్గురువే ఏకైక ఆధారంగా అనుక్షణం జీవించటం** అని శ్రీ మాష్టారి ప్రవచనాలలో ప్రస్ఫుటిస్తుంది. "సద్గురు భోధను అనుసరించి తన జీవితాన్నంతటినీ మలచుకున్నప్పుడే సద్గురువును ఆశ్రయించినట్లు" అన్న శ్రీ మాష్టారి వాక్యాన్ని ప్రతిబంబిస్తుంది శ్రీ సార్ జీవితం. **అట్టి నిష్ఠ నిలుపుకోవటానికి అపారమైన సబూరి (సంతోషము - పట్టుదలతో కూడిన ఓరిమి) వహించాలి** అనేది కూడా ఈ మహాత్ముల జీవిత విధానంలో ప్రస్ఫుటిస్తుంది. శ్రీసార్ జీవనంలో ఇవి ఎలా సాధించారో స్మరించుకుందాము.

శ్రీ సార్ రోసిరెడ్డి తాతగారితో "స్వామి వద్ద నుండి ఏమి నేర్చుకున్నారు" తాత? అంటే వెనువెంటనే "డబ్బు లేకుండా జీవించేది! నేర్చుకున్నాను, సుబ్బరామయ్య" అని చెప్పారు! శ్రీ సార్ గృహస్థ ఆశ్రమంలో కూడా (లౌకిక) సంపద ఆధారంగా కాక, సద్గురువే ఆధారంగా ఎలా జీవించారు? అనేది చూడవచ్చు. **శ్రీ స్వామి సన్నిధి, సాంగత్యము, ఆదేశం ప్రతి చిన్న విషయంలో శ్రీ సార్ కు జీవన నిర్దేశాలు, కానీ లౌకిక**

**ప్రయోజనాల, ఆలోచనల స్పృహే లేదు.** ఈ జీవన పయనంలో అమ్మగారు కూడా మమేకం అవ్వడం వారి ఆదర్శ జీవనానికి మరింత వెలుగునిచ్చి స్వామి భక్తులు ఎందరికో కృపా వర్షంగా పరిగణించింది. ఉదాహరణకు

1. మొదటి పరిచయంలోనే శ్రీ భరద్వాజ మాష్టారికి ఆకర్షితులై శ్రీ సార్ ప్రతి వారం కలిచేడు నుండి ప్రయాణం చేసి ఆదివారం మాష్టారిని దర్శించుకుని వారి సాంగత్యంలో గడిపి వచ్చేవారు. శ్రీ సార్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. ప్రతివారం ప్రయాణానికి కూడా డబ్బులు చూసుకొని వెళ్ళవలసిన పరిస్థితి. ఇంట్లో శ్రీ సార్ బంధువుల పిల్లలు, పెద్దవాళ్లు (శ్రీ సార్ అమ్మగారు, అమ్మమ్మ గారు మొదలగువారి) బాధ్యత కూడా ఉండేది. పిల్లల చదువుల బాధ్యత, శేషయ్య వైద్యం, ఇలా ఆర్థిక వ్యయం ఉండే ఎన్నో ముఖ్యమైన లౌకిక అవసరాలు. వాటికి సమయము, ధనము మరింత సమకూర్చుకోవడం సామాన్యంగా అవసరమనిపిస్తుంది. శ్రీ సార్ కు ఇట్టి ఆలోచన లేదు! మరి ఇవన్నీ ఎవరు చూస్తారు అన్న ఆలోచన నుండి శ్రీ సార్ ఎలా బయటపడ్డారు?

   శ్రీ అమ్మగారు కూడా సార్ వారం వారం మాష్టారు వద్దకు వెళుతుంటే, సార్ ఎంతో ప్రశాంతంగా ఉండడం గమనించి ఖర్చులకు అప్పుడప్పుడు ఉంచుకున్న పైకం మిగుల్చుకొని, ఆ డబ్బు ఇచ్చి శ్రీ సార్ ను పంపేవారు. శ్రీ సార్ సంతోషంగా ఉండడం,

ఇంట్లో అందరూ సంతోషంగా-ప్రశాంతంగా ఉండడమే అమ్మగారికి ప్రాముఖ్యం. అంతేకానీ డబ్బులు ఆదా చేయడము ముఖ్యం కాదు! ఇవి వారి గృహస్థ జీవనానికి మౌలికలు. **వారి, పిల్లల భవిష్యత్తు డబ్బుపై కంటే, సద్గురు కృప-సాంగత్యం పైననే ఆధారపడి ఉందన్న సహజసిద్ధమైన విశ్వాసము, ఆచరణ.** దాని వలన శ్రీ సార్ కుటుంబం నష్టపోయిందా? అంటే కలిచేడులో మొదటి మిద్దె శ్రీ సార్ ది అని చెబుతారు. వారి నెల ఖర్చులు ఎంతో ఒబ్బిడిగా, మితంగా అవసరార్థం మాత్రమే, ఎట్టి వ్యామోహాలకు కాక, ఖర్చు చేసుకొని ఆ ధనంతో గృహస్థాశ్రమ ధర్మంగా చక్కటి ఆవాసం ఏర్పరచుకున్నారు.

2. భగవద్గీత చదివినా అర్థం కాలేదు, ఆటలు, పాఠాలు, స్కూల్లో, ఇంట్లో చిలక పలుకులు, ఇలా మాష్టారి పరిచయం కాకముందు జీవితం అని చెప్పిన శ్రీ సార్, మాష్టారు వడ్డీ వ్యాపారం చేస్తే కూతురుకు వేశ్యా వృత్తి నేర్పినట్లు అన్న వాక్యంతో వడ్డీ వ్యాపారంతో అదనపు సంపదకు స్వస్తి చెప్పారు. ధ్యానం అభ్యసించడంలో భాగంగా ఏ ఆలోచనలు వస్తున్నాయో మరలా, మరలా ఆ పనులు ముఖ్యమా? జ్ఞానము ముఖ్యమా? అని చూసి మార్చుకోమన్నారు మాష్టారు. ఆ సందేశం అనుసరించి శ్రీ సార్ కు ఉన్న బర్రెలు అమ్మి వేశారు. వాళ్ళమ్మ గారు వడ్డీకి తీసుకొని తిరిగి ఇవ్వని వారితో, ఈ

గడువు లోగా వారికి వారే ఇవ్వకుంటే ఇంక వాళ్లను డబ్బు అడగనని చెప్పి వదులుకున్నారు. సాటి టీచర్లతో చర్చలు, కబుర్ల వల్ల మనసు నిలవడం లేదని సమాజాన్ని త్యజించారు. ఈ రీతి లోకవాసన వదిలి సద్గురువే ఆధారంగా జీవించారు.

3. శ్రీ వెంకయ్య స్వామి వారి ఆజ్ఞ మేరకు గొలగమూడిలో నివాసం ఉండడం ఆరంభించే సమయానికి శ్రీ సార్ కు కలిచేడులో మిద్దె ఇల్లు, ఆ ఊరిలో భూమి మొదలగునవి కూర్చుకున్నారు. స్వామి ఆదేశం మేరకు “గొలగమూడి రాత్రి నివాసం ఉంటాను” అని చెప్పుకునేటప్పుడు అవేవీ ఆటంకాలు కాలేదు. ఆలోచనకు రాలేదు. అలానే కుటుంబం కలిచేడు శ్రీ సార్ గొలగమూడి ఎలా? కుటుంబం నుండి దూరంగా ప్రతిరోజు ఉండడం బాగుంటుందా? అనే ఆలోచన ఆటంకం కాలేదు! **గురు ఆదేశం అన్న ప్రేరణ ఏకైక ఆధారము, ఆదేశం, మార్గ నిర్దేశంగా జీవించారు.** అట్లే శ్రీ సార్ గొలగమూడి నివాసం ప్రారంభించాక, అమ్మగారు కూడా “కుటుంబం ఇక్కడ, మీరు అక్కడ ఇదేమిటండి?” అని గొలగమూడి వచ్చేశారు.

4. గొలగమూడిలో నివాసానికి పూరిపాకే! పాములు వసించే కొంపటి! నీళ్లు ఎంతో దూరం వెళ్లి తెచ్చుకోవడం! సున్నం రాలే గోడలు! ఇలా వారి ఎన్నో కష్టాలు సంతోషంగా, ఓర్పుగా జీవించారు. సద్గురు

ఆజ్ఞపై సార్ కు, అమ్మగారికి గల నిష్ఠ వల్ల ఇవేవీ అసాధ్యం అనిపించలేదు! **అపారమైన సబూరి, సంతోషము పట్టుదలతో కూడిన ఓరిమిని, సద్గురునిపై ఏకైక ఆధారంగా ఉండుటకు ఆభరణంగా ప్రవేశ పత్రంగా కలిగి జీవించారు.** శ్రీ సార్ ఆరోగ్యం గొలగమూడి శ్రీ స్వామి సన్నిధిలో సరికావడంతో, “మరల కలిచేడు వెళ్లే ఆలోచన ఉండరాదు” అనే భావంతో కలిచేడులోని ఎంతో శ్రమతో సమకూర్చుకున్న ఇంటిని, శారీరక, మానసిక కష్టంతో ఏర్పరచుకున్న భవనాన్ని అతి తక్కువ ధరకే, ఎంతకు అమ్ముడు పోతే అంతకు అమ్మివేశారు. ఆ ఈ త్యాగానికి **సద్గురు సన్నిధిలో పూర్ణ ప్రాప్తి అనే పర్మిట్-అనుమతి పత్రం సాధించి సద్గురు పరిపూర్ణకృపకు పాత్రులై, సద్గురుపై నిష్ఠ-సబూరి వహించి, సమాశ్రయము ఎలా చేయాలో, సద్గురువే ఒక్కరే ఆధారంగా ఎలా జీవించి తరించాలో మానవాళి అందరికి మార్గదర్శకమయ్యారు.**

నిష్ఠ - సబూరి సమర్పించటం లేదా శరణాగతి అనేది ఒకసారి చేసి తరువాత ఫ్రీగా ఉండటం కాదు అని శ్రీ సార్ ఒక లెటర్ లో వ్రాస్తారు. ఇందులో భాగంగా సద్గురువు మన బాధ్యత వహిస్తున్నారు, వహించుటకు మనము సద్గురుని కనుసన్నలలో - శరణాగతిలోనే, వారి ఆదేశము మేరకు జీవనము సాగించాలి. అది సడలినప్పుడల్లా / సడలు తున్నప్పుడు / సడల బోయేప్పుడు వెంటనే సద్గురునికి విన్నవించుకోవాలి అనేది శ్రీ సార్ ఆచరణలో

ప్రతిబింబిస్తుంది. సదురువునకు ప్రీతి కలిగించే జీవనమునకు కృషి "నిష్ఠ - సబూరి నిలుపుకొనే, పటిష్టం చేసుకొనే ప్రయత్నమే" అని శ్రీ భరద్వాజ మాష్టారు ప్రవచనాలలో కూడా చెబుతారు. అది సూచిస్తూ శ్రీ సార్ ఒక సందర్భంలో "నువ్వు ప్రయత్నము చేస్తూఉంటే, తప్పు పోయినప్పుడల్లా మొట్టికాయ వేసి చెబుతాను" అన్నారు. అలా సద్గురు సహాయం, హృదయోపదేశం, అభయహస్తం ఎల్లప్పుడూ అనుభవము అవుతూ ఉండేలా నడపమని ప్రార్థిద్దాం.

## భక్తుల అనుభవాలు

ఓం సాయిరాం

సాయి, తిరుపతి, శ్రీ సార్, నిష్ఠ - సబూరి తప్పే సమయాలలో ఎలా సరిచేసారో ఇలా పంచుకొంటున్నాడు.


సాయి సుబ్రహ్మణ్యం 2003 లో ఒకసారి హాస్పిటలైజ్ అయినప్పుడు అచ్చటి ఆహారము, ఇతర పరిస్థితుల వల్ల రాత్రి నిద్ర సరిగా పట్టేది కాదు. అప్పటి వరకు గొలగమూడి లో సార్ సాంగత్యంలో ఉన్నంతగా భగవంతుని స్మరణ కూడా జరిగేది కాదు. రెండవరోజు శ్రీ సార్ ఫోన్ చేసి సాయి వాళ్ళ అమ్మగారితో "అమ్మ! మీరు హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన తరువాత ఇంటికి వెళ్ళేటప్పుడు ఒకసారి కారులో అయినా సాయిని ఇక్కడకు


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

తీసుకువచ్చి, స్వామికి కృతజ్ఞతగా దండం పెట్టి వెళ్లి పొండి" అని చెప్పారు. శ్రీ సార్ మాటలలో ఏమి మహత్యం ఉందో కానీ సాయి ఆలోచన అంతా శ్రీ సార్, స్వామి మీదకు వెళ్ళింది. సాయికి తాను పాలు ఎక్కువగా త్రాగటం వల్లనే నిద్ర పట్టటం లేదు అనే ఎరుక కలిగించారు. పగలు పడుకోబోతే ఒక డాక్టర్ వచ్చి పగలు పడుకుంటే రాత్రి నిద్ర ఎలా పడుతుంది అని అనటంతో పగలు అంతా సార్, స్వామి స్మరణతో గడవటం వల్ల రాత్రి నిద్ర పట్టేది. సాయి త్వరగా కోలుకొని, తిరుగు ప్రయాణంలో 3 రోజులు సార్, స్వామి సన్నిధిలో గడపడం జరిగింది. **ఏ పరిస్థితులలోనైనా సద్గురు స్మరణ ప్రదాత శ్రీ సార్.**

శ్రీ సార్ సత్సంగం, హెచ్చరికల కారణంగా తరువాత నెల రోజులు సాయి దమ్మపేటలో రెస్ట్ తెసుకోవలసి వచ్చినా, ఆ నెల వ్యర్ధ సంభాషణలతో (పరామర్శలతో) గడపక, అతను స్వామి స్మరణలో గడిపేలా చేసారు. లౌకికంగా కష్ట కాలమే అయినా, వ్యర్థ ఆలోచనలతో సంభాషణలతో, ఆరోగ్య జాగ్రత్తల నెపంతో సార్ స్మరణ నుండి తొలగనీయక వారి కృప, సర్వ సమర్థత, ప్రేమలతో నిరంతర స్మరణ ప్రదాతగా నిలిచారు. అలానే సాయి PhD చదివేటప్పుడు ఎన్నో భయాలను, అపోహలను తొలగించి, వారి సన్నిధికి రప్పించుకుంటూ, ఆరోగ్యం ప్రసాదిస్తూ, చదువులో ఏమాత్రం

వెనకబడకుండా ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదిస్తూ నిరంతర స్మరణ తో ఎన్నో దివ్యానుభవాలతో నడిపించారు.

సాయి పోస్ట్ డాక్టరేట్ కోసం France చదువుకు వెళ్ళినప్పుడు మరల మరపు వచ్చిన సన్నివేశంలో "నువ్వు అక్కడ చేసేవి నాకు తెలుస్తాయి" అన్న అనుభవములు ఇస్తూ, వాచా "నువ్వు అక్కడ చేసేవి నాకు ఎలా తెలుస్తాయి?" అన్న చురకవేసి మరుపును తొలగించి మరల నిరంతర స్మరణ వైపు నడిపించారు. **నిరంతర స్మరణ ప్రదాత శ్రీ సార్ !**

**శ్రీ సార్ మనకు నియమపాలన చేయించడంలో ఎన్ని మార్గాలు అవలంబిస్తారో** ఈ క్రింది అనుభవం కూడా తెలుపుతోంది.

2019 లో ఒకసారి సాయి సుబ్రహ్మణ్యం అపుడపుడు ఇంటర్నెట్ చూస్తూ సమయం వ్యర్ధం అవుతోంది అని "వారం రోజులు ఇంటర్నెట్ జోలికి పోనని" నియమము పెట్టుకున్నాడు. మూడు రోజులు అయ్యాక పాలు మారి మరల ఇంటర్నెట్ లో ఏవో చూడటంతో కాలం వ్యర్థం చేయటమే కాక పెట్టుకున్న నియమం ప్రక్కకు తోసి వేసాడు. పైగా సార్ ఉన్నప్పుడైతే హెచ్చరించేవారు, సార్ సన్నిధి తోనో, అనారోగ్యం పెట్టి అయినా బయట పడవేసే వారు. ఇప్పుడు ఎలా బయట పడేది ? అనుకున్నాడు. మరో రెండు మూడు రోజులలో తనకు కొంత అనారోగ్యం రావటం, ఆ అనారోగ్యం తను పెట్టుకున్న నియమం, ఉల్లంఘించడం (శ్రీ

సార్ కు ఇచ్చిన మాట తప్పటం) వల్లనే నని శ్రీ సార్ గుర్తింపు కలుగ చేసారు. శ్రీ సార్ కు సాయి క్షమాపణ చెప్పుకున్నాక మరల రెండు, మూడు రోజులలో ఆరోగ్యం చేకూరింది. **సార్ భౌతికంగా ఉండగా తనను నియమ పాలన చేయించుటకు మొండి ఎద్దుల సేద్యం ఉదాహరణ చెబుతూ అవసరమైన సమయాలలో అలానే చేయించేవారు. ఇప్పటికి అంత స్పష్టంగా నడిపిస్తూ మనలను ఉద్ధరిస్తున్న సార్ కు హృదయ పూర్వక కృతజ్ఞతలు.**

---

ఓం గురుభ్యోనమః

## శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

ఓం

**17-09-04 శివ కి: Don't care for the world. Go ahead as your will says**

గొలగమూడి

7-09-04

Dear Siva,

ఏమీ అధైర్య పడవద్దు. పెళ్లికి వెళ్లి అక్కడ భోజనాలు వాళ్ళు వండింది తిని ఉంటావు. వాళ్ళ సొమ్ము తిన్నా ఇబ్బందే! ఇది స్వామి వారి ఆజ్ఞ అని. ఎక్కడైనా నీ సొమ్ము నీవే వండుకొని తిను. అది సాధించాలంటే లోకాన్ని

బంధువులను, స్నేహితులను వదులుకోమని చెప్పను, కానీ వాళ్ళేమనుకుంటారో అనే భావం తీసేసుకోవాలి.

**Don't care for the world. Go ahead as your will says –**

శ్రీ సుధీంద్ర బాబు గారి మాట అక్షర సత్యం. చాక్లెట్లు, బిస్కెట్లు, కేకులు, పూర్తిగా మానేయ్. పండ్లు తిను, పాలు త్రాగు, అన్నం చేసేటప్పుడు, అంటే కూరలు తరిగేటప్పుడు – తినేటప్పుడు ఆకలి రూపంలో ఉన్న పరమాత్మ కు సమర్పిస్తున్నాము. నామస్మరణ లేకుండా తింటే వారు స్వీకరించరని జాగ్రత్తగా నామస్మరణ చేయి. కాకబలికి సమర్పించి తినడం.

మొన్న పెండ్లిలో జరిగిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా "రోజుకొక పూట ద్రవాహారం తీసుకొంటాను. అలా మూడు రోజులు ఉంటానని" చెప్పుకో.

**బలహీనమైన మనస్సుకు చాంచల్యము ఎక్కువ, బలముగల మనస్సుకు చాంచల్యము తక్కువ.**

"ఇంద్రియాణాంహి చరతాం యన్మనోను విధీయతే – తదస్య హారతి ప్రజ్ఞాం వాయుర్నావ మివామ్భసి" అన్న గీతా వాక్యాన్ని ఆధారంగా యోచించు.

**విద్యార్థి లక్షణాలు :- జీర్ణ వస్త్రం – కాక దృష్టి – బక ధ్యానం – మితాహారం గుర్తు పెట్టుకో .**

నీ ప్రాజెక్ట్ పని ముఖ్యం. నీవు ఇక్కడకు రాకుంటే నష్టం లేదు. సాయి మద్రాసులో ఉన్నాడు. శుక్రవారం వస్తాడేమో! అమ్మ కూడా మద్రాసు వెళ్లారు.


శ్రీ స్వామి వారి ఆశీస్సులతో


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

పె. సు.

*******శ్రీ సద్గురు దేవా శరణం శరణం*********

**22-06-2002 న శివ వ్రాసిన లెటర్ - హనుమాన్ ఘాట్ గురించి దర్గాస్వామి వారు చెప్పినది (తరువాత లెటర్ లో సార్ వ్రాసిన రిప్లై ఉంది):**

Om

గొలగమూడి


22-06-2002

పూజ్యనీయులయిన సుబ్బరామయ్యగారికి మీ శివ నమస్కరించి వ్రాయునది. ఈ రోజు రాత్రి శ్రీ సద్గురు దర్గా స్వామికి phone చేశాను. అంతకు ముందు వచ్చిన కల గురించి (కలకత్తా, హనుమాన్ ఘాట్ లో రెండు రోజులు తపస్సు చేయమన్న దాని విషయమై) అడిగాను.

స్వామి చెప్పారు : "మొదట వాచిక తపస్సు చెయ్యాలి. మాటలు మాట్లాడే ముందు బాగా ఆలోచించి 'ఆచి తూచి' మాట్లాడాలి. ఎదుటి వారు మనను కొట్టినా పరుషమైన మాట రాకూడదు. నోటి నుండి మంచి మాటలే రావాలి." అప్పుడు నేను "మాటలు చాలా తక్కువగా మాట్లాడాలా? స్వామీ?" అంటే "అందరితో మాట్లాడాలి, కాని, మంచి మాటలు, అవసరమైనవే మాట్లాడాలన్నారు'.








తరువాత "మనస్సే గుహ. మనస్సులో అక్కరలేని కోరికలు రానీయకూడదు. మనస్సును నిగ్రహించాలి." ఎలా నిగ్రహించాలి స్వామీ? అన్నాను.

అప్పుడు స్వామి "అమ్మ కూడా (అమ్మయ్య గారు) దర్శనమిచ్చిందన్నావు కదా! అంటే సద్గురు పీటం దర్శనమిచ్చింది. నీకు నచ్చిన నామం బాగా స్మరించు. 'సద్గురు దేవా' అనుకో, 'సద్గురు స్వామీ' అనుకో, 'సద్గురు దర్గాస్వామీ' అనుకో. “తినగ, తినగ వేము తియ్యనుండు” అన్నట్లు చెప్పగా, చెప్పగా నామం బలం అవుతుంది. మనసు నిగ్రహింపబడుతుంది."

అమ్మ చెప్పమన్నది (కలకత్తా). అందుకనే చెప్పాను. ఆ తపస్సుకు అర్హుడు కావడానికి ముందు ఇది చేయాలి. అప్పుడు దానికి అర్హుడవుతావు.

హనుమాన్ అంటే ఆంజనేయస్వామి. అంటే చిరంజీవి. దేహంలో నుండి చుక్కలు పోనీయకూడకు. ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. అమ్మ అదే చెప్పింది. గుహలో  హనుమాన్ ఘాట్ లో తపస్సు చేయడమంటే అదే. దేహం నుండి చుక్కలు పోనియకూడదు.

అప్పుడు స్వామి, ఇంతకు ముందు ఒకసారి కలలో "అవి ఇవి తినవద్దు, గంట ప్రదక్షిణలు చేయి, సత్సంగానికి టైంకు హాజరు కావాలి" అని చెప్పారు, అన్నాను. అప్పుడు స్వామి “గురుగీత చదువు” అన్నారు. "గురుగీత" స్వామీ? అని నేను అనగా, స్వామి “కాదు, ‘గురుచరిత్ర’ చదువు. నీ దగ్గర వుంది కదా! “సాయి లీలామృతం” పారాయణ చేయి. మార్గం చిక్కుతుంది, అన్నారు. సత్సంగానికి వెళుతున్నావా? అనో లేక వెళ్ళు అనో అన్నారు.

అప్పుడు నేను స్వామి "ఇక్కడ ఎవరూ సత్సంగా చేయట్లేదు” అన్నాను. “మనస్సు లోనే సత్సంగం చేసుకో” అన్నారు. ఇప్పుడు ఏం చేస్తున్నావు? అన్నారు. B.Tech 3rd year అయిపోయింది. 4th year లో join అవ్వాలి స్వామి అన్నాను. స్వామి final year కి వచ్చావన్న మాట. GATE వ్రాయిస్తాము. M. E చేయాలి. M.E చేయాలి అన్నారు. ఇప్పుడు ఇక్కడ coaching కి వెళాతున్నాను స్వామీ అంటే Prepare అయ్యి ఉండు. అప్పుడు వ్రాయిస్తాము. స్కాలర్ షిప్ ఇప్పిస్తాము. బాగా చదువు అన్నారు. నామస్మరణ చేసుకుంటూ ఉండు. ఏమయినా అనుమానాలుంటే మళ్ళా phone చేయి. సలహాలు ఇస్తాము. జయం కలగుతుంది. శుభం కలగుతుంది. అని ఇంక పెట్టేశారు.

**********శ్రీ సద్గురు దేవా శరణం శరణం********

27-06-2002 **శివ కి: హనుమాన్ ఘాట్ గురించి సార్ వ్రాసిన లిప్లై**

Om

గొలగమూడి

27-6-2002

Dear Siva!

నీ లెటరు చేరింది. శ్రీ దర్గా స్వామి వారు హనుమాన్ ఘాట్ అంటే చాలా గొప్ప వివరణ ఇచ్చారు. వారు చెప్పింది తప్పక ఆచరించు. మన తెలివి తేటలు ఉపయోగించకుండా - మీరు చెప్పిన దాన్ని హృదయ పూర్వకంగా దాని నిజమైన ఆంతరంగిత అర్థం ప్రకారం ఆచరించేటట్లు నన్ను ప్రేరేపించు ప్రభూ" అని చెప్పుకో. "సద్గురు దేవా" అనేది విశ్వగురుడైన సద్గురుని నామం. దాన్ని ఏమారకుండా తీరిక వేళల్లోనూ, తోవ నడిచేటప్పుడు, స్నానం చేసేటప్పుడు, అన్నం తినేటప్పుడు, మల మూత్ర విసర్జన సమయంలోనూ చాలా తీవ్రంగా చేస్తూ ఉండు. అమ్మ బెంగుళూరు పోకుండా దమ్మపేట కే వచ్చేసింది. చీట్లు వేస్తే బెంగుళూరు పొమ్మన్నారు. తీరా ప్రయాణమై బస్సు దగ్గరకు వెళ్ళాక కుడి కన్ను అదురుతుందని వెనక్కు వచ్చేశారు. శ్రీస్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ

మీ - పె. సు.

************** సద్గురు దేవా శరణం శరణం *******

**24-10-2005 భవాని గారికి: అధర్మం చేయటం కంటే చెమటోడ్చి బ్రతకడం మేలు**

ఓం శ్రీ సాయిరాం

గొలగమూడి

24-10-2005

శ్రీమతి భవాని గారికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం. అమ్మా! నాకు ఫోను లేదు. బెంగుళూరు ప్రసాద్ శనివారం వచ్చి, ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటాడు. ఆ మధ్యలో మధ్యాహ్నం 12:30 వరకు హారతులు. మరలా సాయంత్రం 6:15 మొదలు 6:45 వరకు హారతి, సత్సంగం. ఉదయం 6:00 నుండి 6:30 వరకు హారతి. మధ్యాహ్నం 10:30 గంటల నుండి 11:55 వరకు శ్రీ స్వామివారి సేవ. మధ్యాహ్నం 12:30 గంటల నుండి 1:30 గంటల వరకు భోజనం. ఆ మధ్యలో టైం చూసి మాట్లాడండి. 1-11-2005 నుండి తాతగారు, శ్రీ సాయి మాస్టర్ నిలయంలో ఉండవద్దని శ్రీ స్వామివారి ఆజ్ఞ. కుమారుని నష్టాలను గురించి మీరు పట్టించుకోవద్దు. అతని కర్మ బలీయము. ఎవరు చెప్పినా విననివ్వదు. అధర్మంగా త్వరగా లక్షాధికారులై, ఆటాటోపాలు అనుభవించే కంటే మూటలు మోసి చెమటోడ్చి బ్రతకడం మేలు! రేషన్ కొట్టుకు బియ్యం, కిరోసిన్, చక్కెర ఏమిచ్చినా లంచాలు లేనిదే ఇవ్వరు. ఈ లంచాలు ఎలా పూడ్చాలి? రేషన్ వస్తువులు బ్లాకులో అమ్మి సంపాదించాలి. మీరు చేసే పారాయణ, పూజ, సత్సంగాల వలన ఇప్పటికైనా కళ్ళు తెరిచాడు. హాయిగా బియ్యం మిల్లులో ఉండి (పనిచేస్తూ), గంజి త్రాగినా సుఖంగా ఉండేది కదా! ఆశకు ఇది ఫలితం. శ్రీ స్వామివారికి అబద్ధాలు చెప్పే ఘనుడు నీ కుమారుడు!

ఆయనకు మనం చెప్పలేము. శ్రీ స్వామివారే ఆయనను సరైన మార్గంలో పెట్టాలి.

నా ఆరోగ్యం బాగుంది. మీరంతా క్షేమమని తలుస్తాను. ఎవరూ నిన్ను గురించి పట్టించుకోనక్కరలేదు. శ్రీ సాయి, మనలను సరిగా చూస్తే చాలు. నీకు పిల్లలపై మమకార బంధం పోవాలి. అసలు బాబాను నీవు పట్టుకున్నానని అనుకుంటున్నావు. కానీ అది వట్టిదే! పట్టుకోవడం అంటే హారతులు, సత్సంగాలు మాత్రమేనా? కష్టాలలో మనసు బాధపడకుండా, ఈ కష్టాల ద్వారా మన గత కర్మలు కడిగేస్తున్నాడు అని తలచి నిశ్చింతగా ఉంటే వారు గొప్పగా మీ కర్మలను శ్రీ సాయి చరిత్ర పారాయణతో పోగొట్టగలరు. సర్వస్య శరణాగతి చేసి మనసులో బాధ లేకుండా ఉండడం నేర్చుకోండి. ఎలాగైనా కష్టాలు అనుభవించాలి. సంతోషంగా అనుభవిస్తే సరిపోలే! ఏమిటో నమ్మ! కష్టాలలో ఇబ్బంది పడే వారికి తెలుస్తుంది. నాకేమీ? ఏమైనా చెబుతాను.

శ్రీ స్వామివారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

మందు పొట్లాలు నాలుగు పంపాను. డబ్బిస్తే ఇవ్వండి.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

## సార్ సత్సంగం

**మానవులందరికీ తృప్తి శాంతి ఆనందము, తృప్తి శాంతి ఆనందము కావాల! ఏమి చేస్తే వస్తుందయ్యా?**

సార్: ఎట్టా అంటే, ఇప్పుడు వెంకయ్య స్వామి దగ్గర ఉండలా, వెంకయ్య స్వామి దగ్గర నేను సేవ చేస్తూ ఉంటే నాకేమో వద్దు ఇక్కడ అని. ఏమయ్యా వద్దు అంటే అక్కడ ఉండేదంతా అధర్మపరులు. మనమొక్కరము ధర్మ మార్గంలో ఉంటే వీడు పుడింగిరా అంటుళ్ల! తన్న పోయినాడు అంట ఒక ఆయన. ఆమైన వచ్చి అటు పోయినారు అంట. ఇంకొక ఆయన ఎవడో ఎమ్మెల్యే వచ్చినాడు అంట, వాడికి నేను కర్పూర హారతి ఇవ్వలేదంట. నన్ను తందామనుకున్నాడు అంట. బయటికి రాని వాడి సంగతి చెప్తానన్నాడు అంట. ఈయన అడ్డం పడ్డాడంట ఆహా ఆహా ఆహా సుబ్బరామయ్యను కొట్టబాకు అని. వాడే పోయినాడు ముందు. అలాంటి వాళ్ల ముందర ఎందుకు, లేనిపోని తలకాయ నొప్పి కదా! అట్లాంటి తలకాయ నొప్పి లేకుండా నన్ను తొలగించు స్వామి అని దండం పెడుతుండేది. అది అంచలంచెలుగా తొలగించేసాడు ఆయనే! దానికి నేనేమీ పడల! వాళ్లు చెప్పేదంతా, తప్పుడు సాక్ష్యాలు అని నాకు తెలుసు. తప్పుడు సాక్ష్యాలు అయినా మీరు విన్నారా? ప్రమాణం చేస్తారా? అని నేను అడగలేదు. సరే నేనే దర్గా స్వామిని లోపలికి తీసుకుపోయింది, నేనే అయితే ఇప్పుడు ఏమి? నువ్వు పూజ చేయొద్దు అని అన్నారు.

నేను దండం అని అన్నాను, బయటికి వచ్చేసాను. అట్లా మనం చేసే దానికి ముందు, సేవ చేస్తూ మనసుని కంట్రోల్లో పెట్టుకోవాలి. అప్పుడు ఈ సేవ యొక్క ప్రభావం వల్ల మనసు కంట్రోల్ అవుతుంది. దాన్ని ఆయనే చేస్తాడు. దాన్ని ఊరికే మనము మైనస్లు చేస్తూ, ఉత్తరం పోతూ పడమర పోతున్నామని చెపితే!

GV : మేము చేసిన అదే కదా సార్!

సార్ : అలా చేస్తే ఎట్లా, అలా చేస్తే ఎట్లా చెప్పు ? (నవ్వులు)

GV : అన్ని మైనస్లే వస్తున్నాయి సార్, ప్లస్‌లు లేవు సార్, ఇబ్బందిగా ఉంది సార్, అందువలన

సార్ : ఏమి ఇబ్బంది. ఒక ఎగ్జాంపుల్ చెప్పు !

GV : మనసు నిలబడదు సార్, హారతికి కూర్చుంటానా నోరు చదువుతూ ఉంటుంది, మనస్సు ఎక్కడికో పోయి ఉంటుంది సార్. మనం ఎక్కడో తేలుతూ ఉంటాము.

సార్ : అంతేనా! అంతే కదా. నువ్వేమీ అబద్ధాలు చెప్పట్లేదు కదా! ఆఫీసులో అబద్ధాలు చెపితే ఇబ్బంది. కానీ హారతి చదువుతూ ఉంటే అది పోయింది అంటే, పోతే పోతుంది, దానమ్మ నాయాలది. మాకు అంతా పోకుండా ఉందా? నిలబడి ఉందా ఏంటి? కాని! నేను చెప్పింది అది కాదు. వెంకయ్య స్వామి దగ్గర మైనస్ పాయింట్స్ రావటం అంటే. ఎవరిని నిందించబాక అన్నాడు. ఎవరినీ దూషించబాక, తిట్టబాక అన్నాడు. మేము అక్కడ సమాధి దగ్గరే ఉండి, తిడుతూ ఉంటే, సమాధికి అభిషేకం

చేసేటప్పుడు కూడా, ఇతరులను తిడుతూ ఉంటే అది ఘోరం కదా. తిట్టకుండా ఉందామా అంటే, నేను ఊ కొట్టట్లేదు. ఊ కొట్టకుండా ఉంటే రేపు మందిరంలోకి రానీయడేమోనని, ఒక (భయం) ఆశ. ఎందుకు అట్లాంటి ఆశ? ఏయ్ నువ్వు చేసేది తప్పు, మంచిది కాదు, గమ్మునుండు, పెద్దమనిషి! అంటే సరిపోలా? ఒకరోజు తెగిపోదా నాకు.

GV: అది కాదు సార్, ఇప్పుడు మరలా మొదటికి, వస్తాను. ముందు (సేవ) చెయ్యాలా అని అంటాం కదా సార్? ఏదో ఒక సేవ, ఎవరికి చేసినా అది సేవే కదా, ముందు చేయాలి కదా సార్! అసలు ఆ బుద్ధి రావట్లేదు సార్. అప్పుడు ఏం చేయాలి సార్? తర్వాత భావం ఎట్లున్నాయో చూసుకోవటం అనేది ---

సార్ : ముందు ఆ బుద్ధి రావట్లేదా? వస్తుంది స్వామీ! వస్తోంది గానీ నువ్వు గమనించట్లేదు, దాన్ని. ఏటీఎం కార్డ్ ఎందుకు ఇచ్చినావు ?

GV : ఎప్పుడో ఒక తూరే కదా సార్ !

సార్ : ఎప్పుడో ఒక తూరే! రోజు అదే చేస్తూ ఉంటామా? ఏమిటి?, ఏమయ్యా ఏటీఎం కార్డు ఇచ్చినాడు, తెలుసా మీకు? ఆ మరి ఎట్టా ఇచ్చినాడు? అది అట్లా జరిగిపోద్ది జరిపేస్తాడు. నువ్వేమీ తికమకలు పడబాక. తోటేమో వాళ్ళ పరం చేసేసాడు. డబ్బులు ఏమి తీసుకోకుండా. అమ్మైనే ఉంటివి, అవన్నీ ఎట్లా చేస్తున్నావు? పది లక్షల రూపాయల తోట కొన్నాడు. కొనేసి వాళ్లపరం చేసినాడు. వాళ్లు ఇంటి దగ్గర లోడు కుంటున్నారు. ఇంకా ఖర్చులకి. అవన్నీ వస్తాయి లే తొందరగా, ఒకే తూరి

చేయాలి అని చెప్పి అనుకోకూడదు, గురుసేవ, అంటాడు. ఇప్పుడు నువ్వు చేసేది గురుసేవే. వెంకయ్య స్వామి దగ్గరకు వచ్చి ఇవన్నీ టైప్ చేసి, ఆడిట్ చేసి ఇస్తున్నావు. ఇదంతా కూడా గురుసేవే కదా! (అవి) లేకపోతే నేనింత నిశ్చింతగా కూర్చుంటానా. మీకు దండం, మీ డబ్బులు నాకు వద్దు అని చెప్పి కూర్చోనా?. ఆ హుండీలో వేసినా, నాకు వద్దనే వద్దు, అని చెప్పి హుండీ కూడా తీసి పారినూకనూ? వేణుగోపాల్ ఉన్నాడు, ఆడిట్ చేస్తాడు, మనకి ఆ సంబంధమే లేదు. అట్లుండాలా! అట్లుండేటట్టు ఆయనే చేస్తున్నాడు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నాడు. ఎన్ని? ఈయన్ని (ప్రసాద్ ని) బెంగళూరు నుండి రమ్మన్నానా? నిన్న పొద్దున్న పాలు తాగిపోయి, సందేహాలు వగ దెంచుకుని వచ్చినాడు అన్ని. మరలా రేపు, ఎల్లుండి మరల ఈయన పోవాలా. రేపు అంతా ఆయనకు టైం ఇచ్చి, మరలా ఈన్ని పంపించి, చేసినాడా? లేదా? అని కన్ఫామ్ చేసుకోవాలి. మరి అందరిని తీసుకొచ్చి పెడుతూ ఉన్నాడు. ఎవరు ఎట్లా పోయినా, ఆయన ఉన్నాడు హారతులు చేయటానికి. నేను ఏమి చేసినాను?

GV : ముందర చేస్తూ, మనం చేస్తూ, మనసునిస్తూ ఉంటే నిర్మలమైనది ప్రసాదిస్తాడు.

సార్ : ఇస్తాడు, అదే వస్తది. ఇది ఊరికినే చేస్తూ, చేస్తూ ఉంటే కాదు. మనం ఎక్కడ పోతున్నాము? నువ్వు “ఎం ఐ సి” జ్ఞాన కేంద్రాలకు పోయావు కదా. వాటి సారాన్ని అనుసరించాలి. (మనసు) ఎందుకు పోతుంది ఇట్లా? ఎందుకు పోతుంది, ముండమోపిది! ఈడ ఉండి హారతులు పాడకుండా


ఆడకు పోయింది. మన ఆలోచనల వల్ల జరుగుతుందా? జరగదు. మనం చేసే ఆలోచన ప్రకారం జరగదు నాయనా! అది నిశ్చయంగా చేయాల, స్వామీ. అవన్నీ నువ్వే సరి పెట్టు అని చెప్పుకొని పారాయణం చేయటం. అట్లా చేస్తూ ఉంటే సద్గురు సేవ, సద్గురుసేవ  భగవద్గీతలో నాలుగవ అధ్యాయంలో చెప్పినాడు గురువు కాడికి పొమ్మని. “తద్విద్ధి ప్రణిపాతేన” అనే దాంట్లో అందరూ మిస్ కాన్సెప్షన్ అయిపోయినారు. నాకు తెలిసిన వాళ్లంతా, మిస్ కాన్సెప్షన్ అయ్యారయ్యా. భరద్వాజ మాస్టర్ ని రాత్రయితే చంపుతూ ఉండేవారు. నిద్రపోనీరు! కోడికేస్తే పిల్లకి, పిల్లకి వేస్తే కోడికి. దాంట్లో మాట్లాడకుండా ఉండేది, నేను ఒక్కడినే! దేవయ్యగూడ అప్పుడప్పుడు వేస్తుంటాడు, ఒక రవ్వ. నాకు ప్రశ్న తెలియదు, ఆయన చెప్పేది ఏంటో, వాళ్ళు ఏం వేస్తున్నారో తెలియదు. ఏం చేస్తున్నారో తెలియదు. ఏదీ అర్థం కాదు. కయాస్ అండ్ కన్ఫ్యూజన్! కమ్మంగా నిద్రపోతా. ఆయన లేడు.. ఇక్కడ ఉండేవాళ్లు రెండు రకాలు. అన్నీ తెలిసిన వాళ్ళు. అన్నీ తెలియనివాళ్లు. అన్నీ తెలిసిన వాళ్ళు ప్రశ్నించరు. అన్ని తెలియని వాళ్ళు ప్రశ్నించరు. అంటే నువ్వు ఒకటైన వెయ్యరా అని. ఎన్ని మాట్లు అయినా, నాకు తెలియదు స్వామి! అని గమ్మున కూర్చుని ఉండేది. అందువలన చెప్పినది ఆ కథ! ఏ కథ? - ఒక గురువుకి మంచి శిష్యుడు ఉన్నట్ట. ఆ గురువు సమాధి చెందిపోతూ, గాడిదకొడకా! ఇన్ని రోజులు సేవ చేసినావు, ఇన్ని రోజులు చక్కగా సేవ చేసినావు, నీకు దత్తాత్రేయని చూపెడతాను. పాదాలకు దండం పెట్టరా అంటాడు. అలాగే స్వామి, అట్టనే


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

పెట్టేస్తా! ఏ ముండాకొడకా, అట్టనే పెట్టేస్తానంటే, ఆయన మామూలుగా ఉండడురా! చాలా దయనీయంగా ఉంటాడు. గబ్బు కొడుతూ ఉంటాడు. నేను పెడతాను. నువ్వు పెట్టాలి రా. అట్టనే స్వామి. ఆయన రానే వచ్చాడు. ఈయన దండం పెడుతున్నాడు. ఇతనేమో నాలుగు అడుగులు దూరంగా వెళ్ళాడు. ఓరి పాపిష్టి ముండాకొడకా, ఎందుకు ఇట్లా చేసినావు. ఇంకొక తూరి పిలుస్తాను రా. అప్పుడైనా చేయరా. అలాగే స్వామి, చేయాలని ఉంది స్వామి, కానీ చేయలేకపోతున్నాను! గబ్బు కొడుతున్నాడు. దగ్గరికి పోవటానికి లేకుండా, పుర్రెలు కూడా.. శుభ్రమైన పుర్రెలు కావు. మాంసం అతుక్కున్న పుర్రెలు అతుక్కొని ఉన్నాడు. అబ్బా! రెండవ తూరి కూడా అట్లానే అయింది. మూడో తూరి కూడా ఈయనకు తెలుసు. వాడు పెట్టడు, వాడు. దండం పెట్టడం వెనక్కి తిరిగి వానిని ఒక తోపు తోస్తాడు, కాళ్ల దగ్గరికి. ఆయన ఇట్లా అంటారంట. అయిపోయింది వాడి సంగతి స్వామి. అది మాత్రం నాకు సరిపోతుంది స్వామి, అంటా ఉంటూ ఉంటా! నేనేమీ నువ్వు చెప్పినవి చేయలేను. కొండకోనకు అడవి బాట తెలియదు.

GV : మాకు కూడా అదే ఈజీగా ఉంది సార్ !

సార్ : అదే ఈజీ! ఇవన్నీ శాస్త్రాల చదివి, చింతకాయ అంత మనం ఊడదీసి, అదంతా ఆచరించేది అయ్యే పనా? చచ్చే పనా ?

GV : అలా అయితే మమ్మల్ని కూడా తోసేయండి సార్!

సార్ : ఆయనే తోసి పారినోకడా! తోసేసి ఉండలా నిన్ను. ఇక్కడనే ఇల్లు కట్టి, శుద్ధంగా పడి ఉండు ఇక్కడే అనే. ఆయన యొక్క ప్లాను, మన ప్లాన్ కి

అందుతుందా! మన ప్లాన్లకి అందడు. ఆ టైము వస్తుంది. ఆ టైం వచ్చినప్పుడు, ఆయనే తీసుకొచ్చి పెట్టుకుంటాడు. ఇప్పుడు నన్ను పెట్టుకోలా? నేను ఎప్పుడైనా 15 వేల రూపాయల జీతం వదులుకొని, ఇక్కడికి వస్తాం అనుకున్నాను అయ్యా? బస్సు ఎక్కటమే, అయిపోయింది. పూర్తిచేసి పారి నూకి నాడు (నవ్వుతూ)..సంచి ఎత్తుకుంటే ఆ కొరవ కూడా పూర్తి చేసినాడు. ఆయనే చేస్తాడు, ఆయనే చేస్తాడు. కానీ ప్రవృత్తుల బాగుంటే, అన్ని అయిపోతాయి నాయనా. ప్రవృత్తి అంటే నేను పెద్దవాడిని కావాలా, వాళ్ళదీ, వీళ్ళది అందరిదీ నా జేబులో పెట్టుకోవాలా! ఉద్దేశం ఎప్పుడు ఉండదో, దాంట్లో చెప్తాడు, ఆహార శుద్ధి అని చెప్తాడు, ఆహార శుద్ధి అంటే ధర్మంగా అర్జించినదాన్ని ఉపయోగించుకోవటం. ధర్మంగా ఆర్జించిన దానిని (మాత్రమే) ఉపయోగించుకోవటం. ఆ మాట గాని, ఆహార శుద్ధి అని, వచ్చిందంటే భరద్వాజ మాష్టారు ఆ రోజు ఇంక ఏది మాట్లాడడు. ఈ ఆశ్రమం వాళ్ళు, పీఠాధిపతులు, వాళ్ల గురించి ఎత్తుకుంటాడు. ఒక్కడైనా కడుపు నొప్పి తగ్గించగలుగుతున్నాడా? వాళ్ళు ఎందుకు? ఈ ఫియట్ కార్లు, ఇవి, అవి అని తిరుగుతున్నారు. సాయిబాబాని చూడరాదా? వెంకయ్య స్వామిని చూడరాదా? అక్కలకోట స్వామిని చూడరాదా? వాళ్ళు ఎట్లా ఉన్నారు? అది లేకుండా వీళ్లు ఈ విధంగా తింటున్నారే, మరి ఎన్ని జన్మలకి తీర్చుకునేది వాళ్లది?


**- సశేషం**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ధగ్గాస్వామి

# మహాత్ముల వాక్యాలు

*ఇతరులకు పరుష వాక్కులతో ధర్మోపదేశము చేయుట గూడ సాధకునకు హింసా మార్గమే. దానిని పరిహరింపవలెను.*

*భక్తుల గుణ కీర్తనము వలన అనుభూతి కలిగినట్లు సాధనల వలనను, శాస్త్రాభ్యాసము వలనను కలుగదు.*

- మాస్టర్ E . K .

**"నీవు - చూసేదంతా కలిపి నేను" - షిర్డీ సాయిబాబా**

**ఈ చూడబడేదంతా కలసి నేను**

శ్రీ సుబ్బరామయ్య సార్ వేంకటేశ్వర రావు అనే భక్తునకు 12-10-2004న నిరంతర స్మరణ గురించి వ్రాసినది మనము మననము చేసుకోవాల్సినది.

గ్రంధము : సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ లేఖలు పేజీ : 58

సార్ ఇలా వ్రాస్తున్నారు :

నిరంతర స్మరణ వివరించమన్నారు. **శ్రీ స్వామివారి దయ వుంటే చాలా సులభము లేకుంటే చాలా కష్టమే.**

మొదట మన విద్యుక్త ధర్మాలు పోను మిగిలిన time లో స్మరించగలగాలి. ఉదాహరణకు స్నానం చేస్తున్నాము ఈ నీటి రూపంలోనూ తమరే, ఈ

చెంబు, స్నానం చేసే ఈ శరీరము, నీటిలోని వేడి, స్నానం చేసే ప్రాణశక్తి, చేస్తున్నాను అనే ఎరుక అన్నీ మీరై ఉండి కూడా నేను వేరు అనే భావం ఉంది. ఇది మిమ్ములను నుండి నన్ను వేరు చేస్తుంది. దీనిని నశింపజేయు ప్రభువు అనుకోవడం, మరొకసారి సబ్బు, సబ్బు పెట్టె, బాత్రూం, బాత్రూం కప్ అందులోని వెలుతురు, ఆ వెలుగు నిచ్చే సూర్యుడు, అందులో నుండి వచ్చే కిరణాలు, వాటిలోని వెలుగు, వేడి వాటిని స్పర్శించే ఈ చర్మము, చర్మములోని ప్రాణశక్తి, వేడి ఉందని తెలిపే ఎరుక ఇవన్నీ నీ వల్లనే. నీ రూపాలే కానీ నేను పరిమితం అన్న భావనే నన్ను తమ నుండి వేరుచేస్తుంది. ఈ భావాన్ని నశింపజేయు ప్రభూ అని చెప్పుకోవడం. స్నానం పూర్తయితే ఈ భావాలే తప్ప గతాన్ని గురించి కానీ భవిష్యత్తును గూర్చి గాని తలంపులు రాకుండా జాగ్రత్త వహించడం. మొదట మొదట ఆ స్మరణ తెగి ఆలోచనలు వస్తాయి కానీ సాధించాలి అనే పట్టుదలను కేవలం శ్రద్ధతో (వట్టి శ్రద్ధ కాదు. Without a trace of impurity) చేస్తే వారి దయ వలన కొన్నాళ్ళకు చక్కగా చేయగలుగుతాము. దొడ్డికి పోతాము అప్పుడు అంతే, ఆహారం తినేటప్పుడు అంతే, దోవన నడుస్తున్నాము అప్పుడు అలానే చేస్తూ ఉండాలి. General గా Past మరియు future తలంపులతో కాలం జరిగిపోతుంది. అది సాధిస్తే తర్వాత విద్యుక్త ధర్మాలలో కూడా వస్తుంది. మనం చేసే పని శ్రీస్వామి వారు మనకు అప్పగించిన పని. గనుక దానిని సాధ్యమైనంత క్షుణ్ణంగా చక్కగా వారి మెప్పు పొందే అంతగా చేయాలి. క్లాసులో చక్కగా చెప్పాలంటే బాగా ప్రిపేర్ కావాలి. వెనుకబడిన

విద్యార్థులకు కూడా అర్థమయ్యేంత చక్కగా చెప్పాలి. అప్పుడు స్మరణ జరగకున్నా. ఇది వారి పని దీనిని అతి శ్రద్ధతో నిర్వహించాలి అనే భావం హృదయంలో నిండి ఉండి ప్రేమతో పాఠాలు చెప్పగలుగుతాము. తీరిక వేళల్లో విద్యార్థులతో శ్రీ స్వామివారి దివ్య లీలలు చెప్పి వారికి శ్రీ స్వామి వారి నుండి అనుభవం పొందే విధంగా మనం వారికి సహాయం చేయడం.

ఒక్క క్షణం కూడా లౌకికమైన కబుర్లలో, సినిమాల కబుర్లలో, పేపర్, రాజకీయాలలో ఇతరులను విమర్శించడంలో గడపకుండా past and future తలంపులు లేకుండా Live at the present లో గడుపుతుండాలి. నిత్యం భావయుక్తమైన పూజ చేయాలి. యాంత్రిక లాంఛనప్రాయమైన పూజ వల్ల మనకు సత్ఫలితాలురావు.

***చేయిస్తావుగా అవసరమైనది నీవైపే చూస్తే, దారం తెగకుంటే 🙏***

ఇష్టాయిష్టాలెందుకు నాకు, నువు ప్రక్కన ఉంటే? (2)...

ఏదైనా నిన్నడిగితే పోలే, ఒంటిదూలమిల్లే (2)....

భయ ఆందోళన లెందుకు నాకు, నువు అంతట ఉండే, నాలోనే ఉంటే! (2)

**చేయిస్తావుగా అవసరమైనది నీవైపే చూస్తే.., దారం తెగకుంటే...(2)**

పదిహేనడుగుల లోతునీళ్లలో నీ భక్తులు నడిచే(2)

సాధ్యా-సాధ్యాలుండున మాకు నువు ప్రక్కనవుంటే..


స్వామి నువ్వు పక్కనేవుంటే


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

చలమానాయుడి రొమ్ముల లోతూ, వక్కెమ్మకు పాదాలే తడిసే!..(2),

విశ్వాసానికి కొలబద్దలుగా నీళ్ళను దించితివా?,

లేక వాళ్ళను పెంచితివా..?? (2)

నీళ్లతో దీపం వెలిగించేస్తావ్, ఖాళీ గిన్నెతో కడుపు నింపుతావ్ (2)...

ఒకటా రెండా నీ లీలలు అవి అనంతమైయ్యేగా...,

మా యోచనకందవుగా...(2)

త్రికరణశుద్ధి లేశము లేదు చేసే సేవలలో, నా కర్మలన్నీటిలో...(2)

నీకర్పించే భక్తిని ఇచ్చి సేవను చేయించు, శ్రమనే శ్రద్ధతో చేయించు (2)

పామరులైనా కర్మయోగులౌ! చూచి నేర్చుకుంటే..

నిన్ను చూచి నేర్చుకుంటే..,(2)

నడిచేస్తాముగ నువు రమ్మంటే! చచ్చి బూడిదైనా, మేము చచ్చి బూడిదైనా (2)

కండ్లూ కండలు లేకున్నా మరి రోసిరెడ్డి తాతా (2)..,

నీ భిక్ష తేవలేదా., నిత్యము భిక్షతేవలేదా??,

అన్నీ ఉన్నా యవ్వనవంతుల చావ చాలదెట్లా?? (2).

కాదూ భక్తి చలాకేగా...నిన్ను విశ్వసించాకేగా... (2)

లడ్డూ దాచి రెడ్డికి యిచ్చే ఆత్మ భర్తవయ్యా, నువ్వే వెన్న దొంగవయ్యా...(2)

దేశము, కాలము ద్వందాలంటూ, వున్నాయంటావా?? (2) అసలున్నాయంటావా?

ఆడేస్తావుగా రాసలీలలు నిష్కాములమైతే..(2).. అంతా నువ్వే అయివుండే..

జన్మకర్మములు సృష్టి నియమములు అంతా నీ సాలా?(2)..

అవి ఎవరికిఉంటాయి?

వాకిళ్ళేక్కరే వక్కేమ్మా మరి తులసమ్మలునూ (2)...

మీటను నొక్కి  బొమ్మలాటను  కత్తిరించు స్వామి ..

మీటను నొక్కి  బొమ్మలాటను  కత్తిరించు దేవా...

అల్లెతాడుతో అంతా నువ్వని చూపించవ స్వామీ 🙏



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**